క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ

యాలాల: ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యాలాల ఎస్‌ఐ గిరి అన్నారు. సోమవారం మండలంలోని ముద్దాయిపేటలో పోలీసు కళా జాత బృందంతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరగడం, ఆన్‌లైన్ చెల్లింపులు ఎక్కువగా ఉండటంతో సైబర్ నేరగాళ్లకు అవకాశంగా మారిందన్నారు. ఫోన్లలో వచ్చే అనవసర లింకులు, యాప్‌ల డౌన్‌లోడ్ విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫోన్లకు వచ్చే ఓటీపీలను అపరిచిత వ్యక్తులకు చెప్ప రాదన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే పీఎస్‌లో సైబర్ విభాగానికి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజ



కొడంగల్ రూరల్: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో పడిపూజ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకంతో పాటు బిల్వాష్టకం, అష్టోత్తర శత నామాలు పఠించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మద్యం జీఓ కాపీల దహనం



ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అనంతగిరి: నూతన సంవత్సర సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన మద్యం జీఓను వ్యతిరేకిస్తూ సోమవారం జిల్లా ఎక్సైజ్ కార్యాలయం ఎదుట బీజేపీ ధార్మిక సెల్ నిరసన చేపట్టింది. ఈ మేరకు జీఓ కాపీలను దహనం చేశారు. అనంతరం ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ ధార్మిక సెల్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఖజానా నింపుకోవడమే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యానికి హాని తలపెట్టేలా వ్యవహరిస్తుందన్నారు. అనంతగిరి అడవిలో సైతం మద్యం తాగుతున్నారని ఇలాంటి వాటిపై నిఘా పెట్టాలన్నారు. అనంతగిరి చుట్టుపక్కల అనుమతులు లేని రిసార్ట్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకునేందుకే ప్రజాప్రభుత్వం



దుద్యాల్: కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న నాయకులు, అధికారులు

దుద్యాల్: ప్రజా ప్రభుత్వం పేదలను అన్ని విధాలుగా ఆదుకుంటోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని రైతువేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కడా అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు, ఆర్‌ఐ నవీన్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మెరుగు వెంకటయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్, గ్రామ అధ్యక్షుడు శ్రీశైలంగౌడ్, ఉపాధ్యక్షుడు కృష్ణ, నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

కొడంగల్ రూరల్: కడా ప్రత్యేక అధికారి కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన 98 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కడా అధికారి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. విజ్ఞాన విహారం

పదుల సంఖ్యలో వినడం కన్నా ఒక్కసారి చూడటంతో ఆ దృశ్యాలు చాలా కాలం గుర్తుండి పోతాయి. తరగతి గదిలో బోధించే పాఠాల తాలూకు స్మృతులను ప్రత్యేకంగా చూసినప్పుడు విద్యార్థుల అనుభూతి వర్ణనాతీతం. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విహారయాత్రలతో విజ్ఞానాన్ని పంచుతున్నారు.

- విహారయాత్రల్లో పలు పాఠశాలల విద్యార్థులు
- క్షేత్రస్థాయి పర్యటనలతో అవగాహన



కర్ణాటకలోని బేలూరు చెన్నకేశవస్వామి ఆలయంలో బొంపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు (ఫైల్)

పరిగి: విహారయాత్రలు విద్యార్థులకు ఆహ్లాదంతో పాటు ఆనందాన్ని కలిగిస్తాయి. పరిగి నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను వివిధ ప్రాంతాల్లో పర్యటించేందుకు ఉపాధ్యాయులు తీసుకెళుతున్నారు. తరగతి గదికే పరిమితం కాకుండా ఉల్లాసం, ఉత్సాహం, విజ్ఞానం పెంపొందించాలనే లక్ష్యంతో క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్నారు. హైదరాబాద్‌లోని చారిత్రక కట్టడాలైన గోల్కొండ కోట, సాలర్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, ట్యాంక్‌బండ్ బుద్ధ విగ్రహం, నెహ్రూ జూపార్క్, శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లతో పాటు రాష్ట్రంలోని ఇతర పర్యటన క్షేత్రాలకు తిప్పుకొస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం, మహానంది, మంత్రాలయం, తిరుపతి, అన్నవరం తదితర క్షేత్రాలకు తీసుకెళ్తున్నారు.

చరిత్ర పాఠ్యాంశాలపై పట్టు

ఏదైన వస్తువులు, జంతువులను ప్రత్యేక్షంగా చూడటం ద్వారా విద్యార్థులు ఎక్కువ కాలం జ్ఞాపకం ఉంచుకునే అవకాశం ఉంటుంది. చాలా మంది ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్న పర్యాటక క్షేత్రాలకు తీసుకెళ్లి పలు అంశాలను తెలియజేస్తారు. అందుకు ప్రభుత్వం కూడా విద్యార్థులను పర్యాటక కేంద్రాలకు తీసుకెళ్లి వారికి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని విద్యాశాఖ సూచిస్తుంది. ఉదాహరణకు వరంగల్‌లోని కాకతీయుల కాలం నాటి తోరణం తదితర కట్టడాలను చూడటం ద్వారా విద్యార్థులు పాఠ్యాంశాంలోని ఆ ప్రదేశానికి అనుసంధానం చేసుకుని సులువుగా అర్థం చేసుకుంటారు. గోల్కొండను సందర్శించడం ద్వారా నవాబులు గతంలో తమ రాజ్యాన్ని ఏ విధంగా నిర్మించుకున్నారు. వారి పరిపాలన రక్షణ విధానం, సంస్కృతి, చిత్రకళ తదితర అంశాలు తెలుసుకునే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వ సూచనల మేరకు ఉత్సాహంతో ఉపాధ్యాయులు విద్యార్థులను పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేస్తున్నారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు విహారయాత్రలకు వెళ్తున్నారు.

కట్టడాల నేపథ్యం గ్రహించాం



విహారయాత్రలకు వెళ్లినప్పుడు మా ఉపాధ్యాయులు మాకు పుస్తకాల్లో ఉన్న అంశాలను చూపిస్తూ వివరించారు. చారిత్రక కట్టడాలను చూసి పలు కోటల గురించి పూర్తి అవగాహన వచ్చింది. ఆనాటి కట్టడాలు, రాజపాలన పర్యవేక్షించి తదితర అంశాలు తెలుసుకున్నాం.

– రాఘవేందర్, పదో తరగతి, జెడ్పీహెచ్ఎస్ బొంపల్లి

అరుదైన జంతువులు చూశాం



నెహ్రూ జూపార్క్‌లో పులి, సింహం, ఏనుగు, ఎలుగుబంటి వంటి జంతువులు, రకరకాల పక్షులను చూశాం. చాలా ఆనందంగా విహారయాత్రలో ఎన్నో విషయాలు నేర్చుకున్నాం. వాటిని పాఠ్యాంశాలకు అనుసంధానం చేస్తూ వివరించడంతో మాకు పూర్తి అవగాహన వచ్చింది.

– మైత్రి, పదోతరగతి, విద్యార్థిని

అవగాహన వస్తుంది



విహారయాత్రలతో విద్యార్థులకు చరిత్రపై పూర్తి పట్టు, అవగాహన వస్తుంది. పాఠ్యాంశాలను నేరుగా చూడటంతో పాటు వారికి క్షేత్రస్థాయిలో వివరించడంతో సులువుగా అవగతం అవుతుంది. విద్యార్థులు చూసిన పరిసరాలను పాఠ్యాంశాలకు అనువాదించుకొని చదువుకుంటారు.

– వెంకటయ్య, ప్రధానోపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్ బొంపల్లి

ప్రశాంతంగా వేడుకలు జరుపుకోండి

నవాబుపేట: నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ అరుణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. నేర సంఘటనలు, ప్రమాదాలు చోటు చేసుకోకుండా రెండు రోజుల పాటు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. డీజే సౌండ్స్‌కు అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమించకుండా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. అతిగా మద్యం తాగి వాహనాలు నడిపితే వారితో పాటు ఇతరులకు ప్రమాదాలు జరుగుతాయన్నారు. వీటిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పోలీస్ బీట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండల ప్రజలు తమకు సహకరించి ప్రశాంతంగా నూతన సంవత్సరానికి స్వాగతం పలకాలని కోరారు.

జీవితం నాశనం చేసుకోవద్దు

తాండూరు రూరల్: నూతన సంవత్సర వేడుకలకు వెళ్లి జాగ్రత్తగా ఉండాలని, బంగారం లాంటి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్ రెడ్డి యువతకు సూచించారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడపొద్దన్నారు. వేడుకల్లో డీజేలు నిషేధమని హెచ్చరించారు. 31న రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ పెద్ద ఎత్తున నిర్వహిస్తామని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

డీజేలకు అనుమతి లేదు

బషీరాబాద్: నూతన సంవత్సర వేడుకల పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బషీరాబాద్ ఎస్‌ఐ శంకర్ హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. నూతన సంవత్సరం సందర్భంగా డీజేలతో ఈవెంట్స్ చేస్తే కేసులు నమోదు చేస్తామని అన్నారు. మద్యం తాగి బైకులు, కార్లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా కృష్ణస్వామి జాతర

దుద్యాల్: మండలం కేంద్రానికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో గుట్టపై వెలిసిన కృష్ణస్వామి జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి సింధూర అభిషేకం, జల కుంభాభిషేకం, పల్లకీ సేవ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మంగళవారం స్వామి వారికి పెరుగు బసంతం, ప్రత్యేక పూజలు సాగనున్నాయి.

నర్సాపూర్‌కు అన్యాయం చేయొద్దు

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలంలోని నర్సాపూర్ గ్రామానికి అన్యాయం జరగనీయొద్దని గ్రామ యువకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. తట్టెపల్లి మండల కేంద్రంలో నర్సాపూర్‌ను కలపొద్దని సూచించారు. పెద్దేముల్ మండలానికి నర్సాపూర్ కేవలం 5 కిలో మీటర్ల దూరమని, తట్టెపల్లి మాత్రం 12 కిలో మీటర్ల అవుతుందని చెప్పారు. పెద్దేముల్ మండంలోనే నర్సాపూర్‌ను కొనసాగించాలని కోరారు.

చౌరస్తా విస్తరణకు సమావేశం

కొడంగల్ : పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాను విస్తరించేందుకు అందరూ సహకరించాలని కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కొడంగల్ అభివృద్ధికి సహకరించాలని అంబేడ్కర్ సంఘాలను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల్లో పోలీసులు కీలకం



కోట్‌పల్లి ఎస్‌ఐ గఫార్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బంట్వారం: సమాజంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమైందని బీఆర్ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్ అన్నారు. సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ గఫార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలను కాపాడుతూనే నేరాలను అరికట్టడంలో పోలీసులు నిత్యం కృషి చేస్తారని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, మాజీ సర్పంచులు మల్లయ్య, రాంచందర్, ఏఎంసీ మాజీ చైర్మన్ మహేందర్, నాయకులు పెంటారెడ్డి, నరేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, హుస్సేన్, ఫైజుద్దీన్, మహబూబ్, ఖరీం, రషీద్ పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ సేవలు మరువలేనవి



తాండూరు: మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్



అనంతగిరి: వికారాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్

తాండూరు: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్ అన్నారు. సోమవారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ విక్రంసింహారెడ్డి, కౌన్సిలర్‌లు ప్రభాకర్‌గౌడ్, రామకృష్ణ, మమతలతో పాటు అధికారులు, సిబ్బంది మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మన్మోహన్‌సింగ్ దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ఒక ఆర్థిక వేత్తగా, అధ్యాపకుడిగా, రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా, రాజ్యసభ సభ్యుడిగా దేశానికి ఎనలేని సేవలను అందించారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాకారం చేసిన దార్శనికుడని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జుబేర్‌లాల, నాయకులు, సిబ్బంది తదితరులున్నారు.

న్యాయవాదుల నివాళి

అనంతగిరి: దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని పలువురు న్యాయవాదులు వ్యాఖ్యానించారు. ఈ మేరకు సోమవారం వికారాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్, సీనియర్ న్యాయవాదులు గోపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బస్వరాజు, కమాల్‌రెడ్డి, సంపూర్ణ ఆనంద్, యాదవరెడ్డి, మాధవరెడ్డి, రాంచందర్‌రావు, నాగరాజు, సంతోష్, రఫీ, శుక్లవర్ధన్‌రెడ్డి, శంకరయ్య, రాజు, తులసీరాం, శ్రీకాంత్, పరమేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇళ్ల సర్వే



కుల్కచర్ల: పీరంపల్లిలో సర్వే చేస్తున్న సిబ్బంది

పరిగి: అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందుతాయని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవర్ధన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాపోల్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శితో పాటు ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గూడు లేని వారికి మొదటి విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: ప్రభుత్వ సూచనల మేరకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్నామని పీరంపల్లి పంచాయతీ కార్యదర్శి సంజీవన్ కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పీరంపల్లి గ్రామ పంచాయతీలో ఇంటింటికి వెళ్లి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సూచనలు, జిల్లా అధికారుల ఆదేశానుసారంగా సర్వే చేపడుతున్నట్లు తెలిపారు.

సక్రమంగా చేపట్టాలి

బంట్వారం: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ రాములు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని ఆయా గ్రామాలను సందర్శించి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. సరైన వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేఖర్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నాయకులు

సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి మల్లేశ్

పరిగి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హోంమంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి మల్లేశ్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ అంటేనే ప్రపంచానికి ఆదర్శమన్నారు. ఆయన చూపిన మార్గాన్ని ప్రపంచం మొత్తం అనుసరిస్తే బీజేపీ మాత్రం వ్యతిరేకంగా వ్యవహరిస్తుందన్నారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంమంత్రి హోదాలో ఉండి అలా మాట్లాడటం సరికాదన్నారు. అంబేడ్కర్ బడుగు బలహీన వర్గాలకు ఎన్నో సేవలను అందించారన్నారు. ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అమిత్‌షా క్షమాపణలు చెప్పేంత వరకు పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత కలుపు మొక్కలను నివారించాలి



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఈకో పాన్ సొసైటీ సభ్యులు

తాండూరు టౌన్: పర్యావరణానికి ముప్పుగా పరిణమించిన ఆక్రమిత కలుపు మొక్కల నివారణపై దృష్టి సారించాలని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నకు ఈకో పాన్ సొసైటీ సభ్యులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆక్రమిత కలుపు మొక్కలు విచ్చల విడిగా పెరగడంతో వ్యవసాయ భూములు, పర్యావరణం, ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. పట్టణ పరిధిలో పెరుగుతున్న కలుపు మొక్కలను మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సాయిసంపత్, నవీన్, ప్రభాకర్, అభిషేక్, శ్రీనివాస్, నరేష్, శివ, రాజశేఖర్ సలీం, షాఫైజల్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి



పాంబండపై పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కుల్కచర్ల: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ కృషి అభినందనీయమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో పీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవస్థ ఉన్నతికి ఉపాధ్యాయ సంఘాల పాత్ర ఎంతో కీలకమన్నారు. సంఘాలు ఉపాధ్యాయుల సమస్యలతో పాటుగా విద్యావ్యవస్థ ఉన్నతికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ హబీబ్ అహ్మద్, ఆలయ చైర్మన్ మైపాల్ రెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బస్వరాజ్, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు నర్సింలు, నాయకులు వెంకటేష్, శేఖర్, సతీష్, పెంటయ్య, వెంకటయ్య, ఆనంద్, తిరుపతి రెడ్డి, సంతోష్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు వేగంగా నడపొద్దు

ట్రాఫిక్ సీఐ వెంకటేశం

చేవెళ్ల: నూతన సంవత్సర ం సందర్భంగా డిసెంబర్ 31న వేడుకలు జరుపుకునే ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని ట్రాఫిక్ సీఐ వెంకటేశం సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 31 డిసెంబర్ రాత్రి ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వాహనదారులు అర్ధరాత్రి దాటిన తర్వాత అతివేగంతో వాహనాలు నడపొద్దని, సురక్షిత ప్రయాణం కోసం హెల్మెట్‌లు ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడిపించొద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితే జరిమానా లేదా జైలు శిక్ష లేదా రెండు కూడా విధించే అవకాశం ఉందన్నారు. వాహనదారులు, ప్రజలు గమనించాలని చేవెళ్ల, శంకర్‌పల్లి, మోకిల, షాబాద్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకల పేరుతో మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడిపించకూడదని హెచ్చరించారు. వేడుకలను సంతోషంగా శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. తనిఖీలు మాత్రం అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో విస్తృతంగా కొనసాగుతాయని తెలిపారు.

చరిత్రకు మూలం సాంఘిక శాస్త్రం



పూడూరులో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కుల్కచర్ల: సమాజంలో సాంఘికశాస్త్రం పాత్ర ఎంతో కీలకమైనదని కుల్కచర్ల ఎంఈఓ హబీబ్ అహ్మద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో సాంఘిక శాస్త్ర టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంఘిక శాస్త్రం నేటి రాజ్యాంగ అమలుకు సూచికగా పనిచేస్తుందని, హక్కులు, విధులను సూచిస్తుందని తెలిపారు. పోటీ పరీక్షలలో భాగంగా సాల్వీడు పాఠశాలకు చెందిన అశ్విని ప్రథమ స్థానం పొందగా ప్రవీణ్, అంబికలు ద్వితీయ స్థానాన్ని, బండవెల్కిచర్ల పాఠశాలకు చెందిన శివ తృతీయ స్థానాన్ని పొందారు. ఆంగ్ల మాధ్యమంలో ముజాహిద్‌పూర్ జెడ్పీ పాఠశాలకు చెందిన కార్తీక్, ద్వితీయ స్థానాలను ఓంకార్, ప్రకాష్‌లు సాధించారు. తృతీయస్థానాన్ని పుట్టపహాడ్ పాఠశాలకు చెందిన దీపిక సాధించారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫోరం అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, అజ్మత్, మోహన్, భాస్కర్, వెంకటయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉన్నత స్థితి

పూడూరు: చిన్నప్పటి నుంచి పట్టుదలతో చదివితేనే ఉన్నతంగా రాణిస్తారని ఇన్‌చార్జి ఎంఈఓ భావన రుషి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. మండల స్థాయిలో తెలుగు మీడియంలో మంచన్‌పల్లి పాఠశాల విద్యార్థులు పూజశ్రీ, శ్రుతి, అనూష మెరిశారు. ఇంగ్లిష్ మీడియంలో కంకల్ పాఠశాల విద్యార్థి ప్రకాష్ ప్రథమ స్థానం, చన్గోముల్ పాఠశాల విద్యార్థి సాహరాబేగం ద్వితీయ, చన్గోముల్ పాఠశాల విద్యార్థి అక్షర తృతీయ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్టుకు ఎంపికయ్యారు. ఈ మేరకు హెచ్ఎం పుష్ప, ఉపాధ్యాయులు చంద్రమోహన్, మల్లేశ్వరి తదితరులు అభినందించారు.